క్లుప్తంగా

క్రీడలతో ఆరోగ్యం



తెలకపల్లి: క్రీడలు ఆరోగ్యాన్ని ఇస్తాయని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కేఎల్‌ఆర్ గార్డెన్‌లో టౌన్‌స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దారుఢ్యాన్నిస్తాయన్నారు. ఈ పోటీలు ఆరు టీంలు తలపడతున్నట్లు సింగిల్ విండో డైరెక్టర్ రాజామహేందర్ రెడ్డి తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు రెడ్డిపాకుల రమేష్, మల్లేష్, ఆనంద్, చంద్రశేఖర్, బాలిదన్న, రాములు, వెంకటేశ్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించాలి

మన్ననూర్: రాష్ట్రంలో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్, తమిళనాడు వంటి కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే వికలాంగులకు రిజర్వేషన్ కల్పించడం జరిగిందని, ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ క్రమంలో వికలాంగుల కోసం ప్రత్యేకంగా రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలను ఇప్పటికే అమలు చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వికలాంగులను 21 రకాలుగా గుర్తించడం జరిగిందని, వారందరిని గుర్తించి రోస్టర్ పద్ధతిలో రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

రైతుభరోసాకు దరఖాస్తులు చేసుకోవాలి

కొల్లాపూర్: ఈనెల 5వ తేదీ వరకు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన వారు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చిన్నహుస్సేన్ యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రైతుభరోసా పొందిన వారు దరఖాస్తులు చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈనెల 20 చివరి గడువు ఉందని, దరఖాస్తుదారులు పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు అకౌంట్, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలను వ్యవసాయశాఖ కార్యాలయంలో లేదా ఏఈఓలకు అందజేయాలని తెలిపారు. ఈనెల 16న సీఎం రేవంత్‌రెడ్డితో రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం కొల్లాపూర్, రామాపురం, ఎల్లూరు రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని తెలిపారు. ప్రత్యక్ష ప్రసారం తిలకించేందుకు రైతులు రైతువేదిక వద్దకు రావాలని తెలిపారు.

రైతుకు పెట్టుబడి సాయం రైతుభరోసా

కల్వకుర్తి: రైతు పెట్టుబడి సాయం కింద రైతుభరోసా పథకం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్నదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు 85,000 మంది రైతులకు రైతుభరోసా అందుతోందని తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి రైతుల ఇబ్బందులను గుర్తించి పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలని నిర్ణయించడంపై హర్షం వ్యక్తం చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి సూచనలతో రైతుల ఖాతాలలో రైతుభరోసా నిధులు జమ చేస్తున్నారని ఆయన తెలిపారు.

డిప్యూటీ సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు



తిమ్మాజిపేట: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను తిమ్మాజిపేట కాంగ్రెస్ నాయకులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర టెలికాం బోర్డు మెంబర్ శ్రీనివాస్ బహదూర్, కాంగ్రెస్ నాయకులు లక్ష్మీనారాయణ, దానం బాల్‌రాజ్, ముబారక్‌లు ఆదివారం హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రిని కలిశారు. ఆయనను కలిసి శాలువాలతో సన్మానించారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని, ఎంపీ, రాష్ట్ర కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవిని కలిసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మల్లేష్, రాఘవేందర్, సిద్దుబహదూర్, శివ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాఠశాల భవనాలు

- చెట్ల కింద చదువులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు



కల్వకోలు పాఠశాలలో చెట్టుకింద తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో గదులు శిథిలావస్థకు చేరుకొని తరగతి గదులు లేక చెట్ల కింద తరగతులు నిర్వహిస్తున్నారు. మండలంలో శిథిలావస్థకు చేరిన పాఠశాలల్లో బాచారం, పెద్దకొత్తపల్లి, దేవునితిర్మలాపూర్, కల్వకోలు, యాపట్ల, ముష్టిపల్లి, మరికల్, నక్కపల్లి తదితర గ్రామాల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో తరగతి గదులన్నీ శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులూడుతున్నాయి. వర్షమొస్తే వర్షపు నీరంతా పాఠశాలల గదుల్లో చేరుతోంది. దీంతో తరగతులు నిర్వహించేందుకు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కల్వలకోలు పాఠశాలల్లో గదుల్లేక చెట్ల కిందనే మూడు తరగతులను నిర్వహిస్తున్నారు. ముష్టిపల్లి ఉన్నత పాఠశాలలో గదుల్లేక మహిళా సమాఖ్య భవనం, గ్రామ పంచాయతీ భవనం చెట్ల కింద తరగతులు నిర్వహిస్తున్నారు. మండలంలో 41 ప్రాథమిక పాఠశాలలున్నాయి. వాటిలో 3009 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 9 ఉన్నత పాఠశాలలున్నాయి. వాటిలో 2800 మంది విద్యార్థులు చదువుతున్నారు. కేజీబీవీలో 246 మంది, బీసీ గురుకుల పాఠశాలల్లో 610 మంది విద్యార్థులు చదువుతున్నారు. మన ఊరు–మన బడి పథకం కింద పాఠశాలలకు మంజూరైన తరగతి గదులను కాంట్రాక్టర్లు అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. ఆ గదుల నిర్మాణం పూర్తి చేస్తే విద్యార్థులకు ఇబ్బందులు తొలుగుతాయి. పాఠశాలల్లో అదనపు గదులకు నిధులు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది.



కల్వకోలులో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల భవనం

ప్రతిపాదనలు పంపాం..



మండలంలోని 9 ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా అదనపు గదులు నిర్మించేందుకు నిధుల మంజూరు కోసం జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే ఆయా పాఠశాలల్లో గదుల నిర్మాణం చేపడతాం.

– కె.శ్రీనివాసురెడ్డి, ఎంఈఓ, పెద్దకొత్తపల్లి

పీడీయాక్టు కేసులు నమోదు చేస్తాం

- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



విత్తనాల పాకెట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: అచ్చంపేట నియోజకవర్గంలో నిఎక్కడైనా నకిలీ విత్తనాలు అమ్మినట్లు రుజువైతే అమ్మిన వారిపై పీడీయాక్టు కేసులు నమోదు చేయిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ హెచ్చరించారు. ఆదివారం అచ్చంపేట పట్టణంలోని ఓ ఫర్టిలైజర్ షాపును ఆకస్మికంగా పరిశీలించారు. విత్తనాలు, మందుల పాకెట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని అధిక రేట్లు, నకిలీ విత్తనాలు, మందులు అమ్మినట్లు రుజువైతే ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. రైతులు విత్తనాలు, మందులు కొనేముందు రశీదులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రైతులు ప్రభుత్వ ఆ మోదం పొందిన షాపుల్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేయాలని సూచించారు. గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్లి నకిలీ విత్తనా లు విక్రయించే వారిపై గట్టి నిఘా ఉంచామన్నారు. అంతకుముందు ఫర్టిలైజర్ షాపులోని స్టాక్ నిర్వహణ రికార్డులను, ఎరువుల బస్తాల లాట్ నెంబర్లు, సర్టిఫికెట్లను పరిశీలించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అచ్చంపేటపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అధికారుల నిర్లక్ష్యం కన్పిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, మాజీ ఎంపీపీ రామనాథం, రంగాపూర్ దర్గా కమిటీ అధ్యక్షుడు రఫీ, మున్సిపల్ కోఆప్షన్‌మెంబర్ ఖాదర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణను పద్మశాలి, పద్మశాలి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. టీపీసీసీ రాష్ట్ర ఉ పాధ్యక్షుడిగా నియామకమైన ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. భక్తమార్కండేయ శివాలయం అభివృద్ధి గూర్చి ఎమ్మెల్యేకు నాయకులు వివరించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు పులిజాల శ్రీనివాసులు, కోట కిషోర్, బోడ రవీందర్, దాసపత్రి శకుంతల, వనంగీత, హైమావతి, యాదగిరి, సత్యనారాయణ, సుధాకర్, కృష్ణయ్య, ప్రశాంతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు కేటాయించాలి



కొల్లాపూర్: ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొల్లి కురుమయ్య, జిల్లా ఈసీ మెంబర్ బంకల దాసు కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్ర కారం ప్రతి ప్రైవేటు పాఠశాలలో పేద విద్యార్థులకు ఉచితంగా 25 శాతం సీట్లు ఇవ్వాలన్నారు. ఈ ని బంధనను ఏ పాఠశాల పాటించడం లేదని ఆరో పించారు. విద్యాశాఖ అధికారులు దీన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేద విద్యార్థులకు ఉచితంగా సీట్లు ఇప్పించాలని కోరారు. సమావేశంలో నాయకులు విష్ణు, అంజి, మధు, లక్ష్మణ్, నాగిశేషి తదితరులున్నారు.

పొలం పనుల్లో రైతులు బిజీబిజీ



తాడూరు: 20 రోజుల క్రితం భూమిలో ఆయా గ్రామాల రైతులు ముందస్తుగా పత్తి విత్తనాలు విత్తుకున్నారు. తరచు కురుస్తున్న వర్షాలకు మొలకెత్తిన పత్తి మొలకలను కాపాడుకోవడం కోసం తోట గుంటుకల ద్వారా గడ్డి, పిచ్చి మొక్కలు మొలవకుండా తొలగించడంలో నిమగ్నమయ్యారు. ఈ సారి ముందస్తుగా కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు పంటసాగులో బిజీబిజీగా ఉన్నారు. నకిలీ విత్తనాల బారిన పడకుండా జాగ్రత్త పడాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

17న చలో హైదరాబాద్



నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలో భవన ని ర్మాణ కార్మిక సంఘం మండల కౌన్సిల్ నిర్వహించి అనంతరం శ్రీపురం రోడ్డులో నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు విజయ్, ఉపాధ్యక్షులు మారెడు శివశంకర్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 17న హైదరాబాద్ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట చేపట్టిన చలో హై దరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, సత్యం, శివశంకర్, లింగం, లక్ష్మయ్య, రాములు, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీలక్ష్మీపద్మావతి వేంకటేశ్వర కల్యాణం

చారకొండ: మండల కేంద్రంలో వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం ఉదయం 11 గంటల కు శ్రీలక్ష్మీపద్మావతి వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణం విజయవంతం చేయాలని వారు కోరారు.

కంకర తేలిన బీటీ రోడ్లు



పాల్మూరు రోడ్డుపై ప్రమాకరంగా గుంత



గుట్టలపల్లి సమీపాన ఏర్పడిన గుంత

తాడూరు: మండల కేంద్రంతో ఆయా గ్రామాలకు కలిపే ప్రధాన రహదారులు మరమ్మతుకు నోచుకోకపోవడంతో ప్రయాణం ఆందోళన కలిగిస్తోంది. పేరుకే ఆర్‌అండ్‌బీ రోడ్లు అయినప్పటికీ రహదారిపై ఎలాంటి సూచిక బోర్డులు లేక ప్రయాణం నరకయాతనగా మారింది. మండలంలోని మేడిపూరు నుంచి పాల్మూరు గుట్టలపల్లి, నడిగడ్డ మీదుగా తెలకపల్లి వెళ్లే ప్రధాన రహదారి మలుపులు తిరిగి ఉండడంతో పాల్మూరు సమీపాన ఇరువైపుల గుంతలు ఏర్పడి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఇంద్రకల్, యాత్మతాపూర్, తుమ్మలసుగురు మీదుగా కుమ్మెర బిజినపల్లి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలు పడి, కంకరతేలి ఇబ్బందికరంగా మారింది. అధికారులు రోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కల్వకోలులో పారిశుద్ధ్య లోపం



పెద్దకొత్తపల్లి: కల్వకోలు గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో మురుగు దుర్గంధం వెదజల్లి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలంలో మురుగు నిల్వ ఉండటంతో ఈగలు, దోమల బెడద ఎక్కువై ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. అధికారులు గ్రామంలోని డ్రెయినేజీలు శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం

కొల్లాపూర్: కొల్లాపూర్ పట్టణంలోని ఆర్‌ఐడీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 2008–10 ఇంటర్ బ్యాచ్‌కు చెందిన అమ్మాయిలు సమ్మేళనానికి హాజరయ్యారు. తమకు విద్య బోధించిన అధ్యాపకులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, వెంకటదాసు, కృష్ణవర్ధన్, వినయ్‌కుమార్, రాఘమయి, పూర్వ విద్యార్థినులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్



బిజినేపల్లి: మండలంలోని మంగనూర్ గ్రామంలో ఎత్తైన స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకోవడమే కాకుండా, కారులాంటి చిన్న వాహనాల బాడీలు దెబ్బతింటున్నాయి. మహబూబ్‌నగర్, శ్రీశైలం ప్రధాన రహదారిలో మంగనూర్ గ్రామం వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్‌ను తొలగించి, వాహనదారులు, గ్రామస్తుల భద్రత దృష్ట్యా స్పీడ్ బ్రేకర్ ఎత్తు తగ్గించి చిన్నగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ విషయమై జేఈ వెంకటస్వామి వివరణ కోరగా, స్పీడ్ బ్రేకర్ సమస్య తమ దృష్టిలో ఉందని, దానిని త్వరలోనే తొలగిస్తామని తెలిపారు.

సంప్రదించాల్సిన అధికారి: జేఈ వెంకటస్వామి
ఫోన్ నంబర్: 7815949120

మైసమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



మైసమ్మ దేవతకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. మృగశిర కార్తె రెండో ఆదివారం రైతులు, వ్యవసాయ కూలీలు అమ్మవారిని దర్శించుకొని వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు పెద్దఎత్తున సొంత వాహనాలలో తరలివచ్చారు. భక్తుల రద్దీ పెరగడంతో మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడి గంటపాటు రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. పెద్దకొత్తపల్లి ఎస్‌ఐ సతీశ్ సిబ్బందితో వచ్చి రోడ్డుపై ఉన్న వాహనాలను క్రమబద్ధీకరించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైసమ్మ జాతరకు వెళ్లే భక్తులు ముష్టిపల్లి, మరికల్, పెద్దకారుపాముల మీదుగా నాగర్‌కర్నూల్ దారిలో వచ్చే భక్తుల వాహనాలు అటువైపు నుంచి వెళ్లాలని సూచించారు. కొల్లాపూర్ ప్రాంతం నుంచి వచ్చే భక్తులు సాతాపూర్, యాపట్ల, చిన్నకొత్తపల్లి గ్రామాల మీదుగా మైసమ్మ జాతరకు వెళ్లితే మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ఉండదని తెలిపారు. ప్రతి ఆదివారం మండల కేంద్రంలో కోళ్లు, టెంకాయలు, పూజ వస్తువులు అమ్ముకునే వారు రోడ్డుపై ఉండకుండా షాపుల ముందు ఉండి అమ్ముకోవాలని సూచించారు. మైసమ్మ జాతరకు 25 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఎండోమెంట్ అధికారి రామేశ్వరశర్మ తెలిపారు. భక్తులు టికెట్లు, హుండీ ద్వారా రూ.3లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

సామాజిక సేవలతోనే గుర్తింపు



చెప్పులు కుట్టే వారిని సన్మానిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

కల్వకుర్తి రూరల్: సమాజంలో నిర్వహించే సామాజిక సేవలతో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు డాక్టర్ సరాబు అనంతం, కొట్ర శ్రీనివాస్‌లు అన్నారు. డ్యాస్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా కల్వకుర్తి వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు 1000 లీటర్ల వాటర్ ట్యాంకులు, మానసిక వికలాంగులను గుర్తించే రెండు కిట్లు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేశారు. డయాబెటిక్ టెస్టులు నిర్వహించారు. ఇద్దరు సైనికులను, ఇద్దరు రైతులను సన్మానించారు. చెప్పులు కుట్టుకునే వారికి గొడుగులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ గవర్నర్ కల్మిచర్ల రమేష్, క్లబ్ అధ్యక్షుడు బాదం రాఘవేందర్, వనిత క్లబ్ అధ్యక్షురాలు ధనలక్ష్మి, జాయింట్ ట్రెజరర్ జూలూరు సత్యం, జాయింట్ సెక్రటరీ గుగ్గిళ్ల శంకర్, జోన్ చైర్మన్ శ్రీనివాసులు, క్లబ్ కార్యదర్శి నీలా కోటేశ్వర్, స్రవంతి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

లట్టుపల్లిని మండలం చేయాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బిజినేపల్లి: లట్టుపల్లి గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన నాయకులు ఆదివారం ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. లట్టుపల్లి గ్రామాన్ని మండలంగా ప్రకటించడానికి తగిన భౌగోళిక పరిస్థితులతో పాటు సౌకర్యాలున్నాయని పే ర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన నాయకులు చంద్రగౌడు, గోపాల్‌నాయక్, వంశీ, వెంకట్ రెడ్డి, రాజుగౌడు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి ఉన్నారు.

హోంగార్డు కమాండెంట్‌పై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న ఈర్ల చంద్రమౌళి

బిజినేపల్లి: అన్నదమ్ముల మధ్య వివాదస్పదంగా ఉన్న భూమిని పట్టా చేసుకుని పాలి అన్నదమ్ములపై అక్రమ కేసులు పెడుతున్న తెలంగాణ హోంగార్డు కమాండెంట్ వెంకటేశ్వర్లుపై ఉన్నతస్థాయి అధికారులు విచారణ చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి డిమాండ్ చేశారు. పోలీస్‌శాఖలో పని చేస్తున్న ఆ అధికారి తమ శాఖ స్థానిక అధికారులను అడ్డుపెట్టుకుని కేసులు నమోదు చేయడమే కాక, తనది ఎస్పీ స్థాయి ర్యాంకు అంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఈమధ్య కాలంలో జిల్లా ఎస్పీని తప్పుదారి పట్టించి, స్థానిక అధికారులతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. స్థానిక సిబ్బందిని పొలం పనులకు ఉపయోగించుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజల కోసం పని చేసే స్థానిక పోలీస్ అధికారులను తన స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. వివాదాస్పదంగా ఉన్న భూమిని తన కుటుంబీకుల పేర పట్టా చేసుకోవడంపై ఆ గ్రామ ప్రజలకు ఎన్నో అనుమానాలున్నాయన్నారు. ఇలాంటి అధికారిపై పోలీస్‌శాఖ, ఆదాయ పన్ను శాఖలు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి భూపేష్‌బాబు ఉన్నారు.